క్లుప్తంగా

విశ్వేశ్వరరావు ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


విశ్వేశ్వరరావు స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఏలూరు (టూటౌన్‌): ఏలూరు నగర అభివృద్ధికి విశేష కృషి చేసిన మాజీ శాసన సభ్యుడు అత్తులూరి సర్వేశ్వరరావు ఆశయాలను ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌ డాంగే పిలుపునిచ్చారు. ఏలూరు వైఎంహెచ్‌ఏ సెంటర్లో అత్తులూరి సర్వేశ్వరరావు స్మారక స్థూపం వద్ద సర్వేశ్వరరావు 43వ వర్ధంతి కార్యక్రమాన్ని ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బరగడ పోతురాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ పతాకాన్ని రెడ్డి శ్రీనివాస్‌ డాంగే ఆవిష్కరించి సర్వేశ్వరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పుప్పాల శ్రీనివాసరావు, పసుపులేటి దుర్గారావు, ఉప్పు గంగాధర్‌ రావు, నెరుసు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

153 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన సామాజిక కార్యకర్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉషా బాలకృష్ణ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 153 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 21 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని వేమగిరి హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అలాగే 33 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి వారికి కళ్ళజోళ్ళు సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్‌ కుమార్‌, తవ్వా మణికంఠ, కేశవ్‌ పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ చిందాడి తేజకు అవార్డు

ఏలూరు రూరల్‌: కరాటే శిక్షణ, సాధనలో విశేష కృషి చేసినందుకు ఏలూరుకు చెందిన కరాటే మాస్టర్‌ చిందాడ తేజబాబిని నేషనల్‌ స్టార్‌ ఎక్సలెన్సీ అవార్డు వరించింది. ఆదివారం విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సినీహీరో భానుచందర్‌ చేతుల మీదగా తేజబాబి అవార్డు అందుకున్నారు.

సౌకర్యాలు నిల్‌.. భారాలు ఫుల్‌

- ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలో పన్నుల అదనపు భారం రూ.5 కోట్లు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరో 15 శాతం పెంపు

ఏలూరు (టూటౌన్‌): సౌకర్యాలు నిల్‌.. భారాలు ఫుల్‌ అన్న చందంగా ఏలూరు నగరపాలక సంస్థ పని తీరు ఉందని నగరవాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతిఏటా ఆస్తి పన్నులో 15 శాతం పన్ను పెంపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ సాకుతో పన్నులైతే ఎడాపెడా పెంచేస్తున్నారు కానీ ఆ స్థాయిలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలో ఆస్తిపన్ను వసూలు లక్ష్యం రూ.32.31 కోట్లు, వాటర్‌ ట్యాక్స్‌ లక్ష్యం రూ.14.48 కోట్లుగా ఉంది. వాటర్‌ ట్యాక్స్‌పై పెంపుదల లేకపోయినా ఆస్తి పన్ను మాత్రం 15 శాతం పెంపుదల చేయడంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో నగర వాసులపై సుమారు రూ.5 కోట్లు అదనపు భారం పడనుంది. పన్నులను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటూ పోతున్న నగరపాలక సంస్థ అధికారులు ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇలా..

ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలో మొత్తం జనాభా 3.70 లక్షల మంది వరకు ఉన్నారు. మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 79 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం వార్డు సచివాలయ సిబ్బందినే


ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

పన్నుల వసూళ్లలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీరిపైన రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది అజమాయిషీ చూస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సంలో పెరిగిన అదనపు పన్నులను కలిపి వసూలు చేయాల్సి ఉంది. దీంతో వార్డు సచివాలయ సిబ్బందిపై మరింత పెను భారం పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

రూ.5 కోట్ల అదనపు భారం

ఈ ఆర్థిక సంవత్సరం 2025-26లో ఆస్తి పన్నుపై 15 శాతం అదనంగా పెంపుదల చేయనున్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను లక్ష్యం అయిన రూ.32.31 కోట్లకు అదనంగా సుమారు మరో 5 కోట్లు మేరకు అదనపు పన్ను భారం పడనుంది. దీనితో పాటు వాటర్‌ ట్యాక్స్‌ను పెంపుదల చేయకపోవడం వల్ల బతికిపోయామని దాన్ని కూడా పెంచేసి ఉంటే తమ పరిస్థితి మరింత దారుణంగా ఉండేదని నగర వాసులు గగ్గోలు పెడుతున్నారు.

సౌకర్యాలు ఎక్కడ?

ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు పన్నులైతే ఇబ్బడిముబ్బడిగా పెంచుకుపోతున్నారు కానీ మౌలిక వసతులు, సౌకర్యాల మాట ఏంటి? అని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగరంలో 80 వరకు మురికి వాడలు ఉన్నాయి. వీటిలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పక్కా డ్రైన్లు ఉన్నా వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. నగరంలో ప్రధాన రహదారులు కాకుండా 50 డివిజన్‌ల పరిధిలో సుమారు 600 వరకు రహదారులు ఉన్నాయి. వాటి నిర్వహణా అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన కొత్తలో హడావుడిగా రోడ్లకు ప్యాచ్‌ వర్కులు చేసి చేతులు దులిపేసుకున్నారనే వాదనలు ఉన్నాయి. రోడ్లు, డ్రెయిన్లు, వీధి లైట్లు, తాగునీటి సరఫరా వంటి వాటికి కార్పొరేషన్‌ నిధులను ఖర్చు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

భారం సరికాదు



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలపై ఏటా ఆస్తి పన్నులపై అదనపు భారాలు మోపడం సరికాదు. నగర పాలక సంస్థ ఆదాయాన్ని అయితే పెంచుకుంటుంది కానీ ఆ స్థాయిలో ప్రజలకు కనీస వసతులు, సౌకర్యాలు కల్పించడం లేదు. అదనపు పన్నులు పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితులపై ప్రభావాన్ని చూపుతున్నాయి. – బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు,సీఐటీయూ,ఏలూరు

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఏలూరు కార్పొరేషన్‌ పరిధిలోని ప్రజలకు కనీస సౌకర్యాలైన డ్రెయిన్లు, తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, పార్కుల నిర్వహణ వంటి వాటి పట్ల అధికారులు దృష్టి సారించాలి. పన్నుల భారం పెంచిన విధంగానే మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే నగర వాసుల్లో పన్నులు భారం పెరిగిందనే భావన కలుగదు. – జి.గోపీ, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

గంగానమ్మకు సారె సమర్పణ


గంగానమ్మకు ఆషాఢం సారె సమర్పిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 28వ డివిజన్‌ తంగెళ్ళమూడి సీతారామనగర్‌ చెరువుగట్టుపై ఉన్న శ్రీ గంగానమ్మ వారికి ఆషాఢమాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్తులు ఆదివారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాగణమంతా అమ్మవారి నామస్మరణతో మారుమోగింది. 250 మంది మహిళా భక్తులతో 108 రకాల స్వీట్స్‌, ఫ్రూట్స్‌, పిండి వంటలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి, ఆలయానికి వివిధ రకాల కాయగూరలతో, పూలతో చేసిన శాకంబరి అలంకరణ ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. అర్చకుడు పొట్నూరి దుర్గేష్‌ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గొంతిన రామకృష్ణ, రేఖల చిన్నారావు, కోనారి దుర్గారావు, కె.లక్ష్మణరావు, కాగిత రమణ, మానపురం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

కళల్లో సంగీతం, నాట్యాలకు ప్రాముఖ్యత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 64 కళల్లో సంగీతం, నాట్యం విశేష ప్రాముఖ్యతను సంపాదించుకున్నాయని గరికపాటి ఆర్ట్స్‌ థియేటర్‌ డైరెక్టర్‌ గరికపాటి కాళిదాసు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో గరిక పాటి ఆర్ట్స్‌ థియేటర్‌ 276వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తొలుత దేవులపల్లి నాగలక్ష్మి (వీణ సోలో), టి.హరిణి, ఎం.స్వరూప, పి.సాయి శివాని, కె.పద్మావతి, ఎన్‌.విజయలక్ష్మి, ఎం. సరస్వతి శ్రీవీక్షణ (వయోలిన్‌ సోలో), ఎండీఎస్‌ మీనాక్షి నిర్వహించిన శాస్త్రీయ భక్తి సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. వీరికి వీరా శివ ప్రసాద్‌ వయోలిన్‌, సీహెచ్‌ లక్ష్మీనారాయణన్‌ మృదగంతో వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి, కళారత్న ఎ.పార్వతీ రామచంద్రన్‌ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య విన్యాసాలు సభికులను అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా వీణాపాణి ఏ. జయలక్ష్మి, ఎ.పార్వతి రామచంద్రన్‌లకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహిత్యమండలికో కన్వీనర్‌ పుల్లాభొట్ల సత్యవాణి, తదితరులు పాల్గొనగా సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తమ రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


వీణాపాణి ఏ. విజయలక్ష్మి, కళారత్న ఏ. పార్వతీ రామచంద్రన్‌లను సత్కరిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అశోక్‌ నగర్‌ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో 11 కేవీ స్టేషన్‌ రోడ్డు ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్‌ లైన్‌ల వార్షిక మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్‌ ఏలూరు డివిజన్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ కేఎం అంబేడ్కర్‌ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని గోపాలని వారి వీధి, వెంకట్రామా థియేటర్‌ రోడ్డు, పవర్‌పేట రైల్వే స్టేషన్‌ ప్రాంతం, కూనిశెట్టి వారి వీధి, కంకణాల వారి వీధి, శేఖర్‌ వీధి, మండూరి వారి వీధి ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీ మిథున్‌ రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపే


సొంగా సందీప్‌

ఏలూరు (టూటౌన్‌): రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌ రెడ్డి అక్రమ అరెస్ట్‌ రాజకీయ కక్షసాధింపే నని వైఎస్సార్‌ సీపీ చింతలపూడి నియోజకవర్గం నాయకుడు, లిడ్‌క్యాప్‌ మాజీ డైరెక్టర్‌ సొంగా సందీప్‌ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఏలూరులో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపు రాజకీయాలు తారాస్థాయికి చేరాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండడంతోనే వైఎస్సార్‌ సీపీలోని కీలక నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్‌ చేస్తున్నారని మండిపడ్డారు. 2014-19లో చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై దాదాపు 13 అవినీతి కేసులు ఉన్నాయని, ఇందులో మద్యం కుంభకోణం కేసు కూడా కీలకమైందన్నారు. ఈ కేసులను నిర్వీర్యం చేసేందుకు ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి వీధిలో బెల్టు షాపు దర్శనమిస్తుందని ఎద్దేవా చేశారు.

ఘనంగా రక్షణ సైన్యం 130వ వార్షికోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రక్షణ సైన్యం 130వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక ఆదివారపు పేటలోని రక్షణ సైన్య సెంట్రల్‌ కోర్‌ చర్చిలో ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘ కాపరి కెప్టెన్‌ నీలా రత్నకుమార్‌ రక్షణ సైన్య జెండా ఎగురవేసి సైన్య స్థాపకులను గురించి, ఆంధ్ర రాష్ట్రానికి రక్షణ సైన్యం వచ్చిన విధానాన్ని గురించి తెలిపారు.

విశ్రాంత అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశ్రాంత అధ్యాపకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వక్తలు కోరారు. రిటైర్డ్‌ కాలేజీ టీచర్స్‌ అసోసియేషన్‌-ఏపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం స్థానిక సీఆర్‌ఆర్‌ అటానమస్‌ కళాశాల ఆడియో విజువల్‌ హాల్లో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ కృష్ణారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అడిషనల్‌ క్వాంటం ఆఫ్‌ పెన్షన్‌, ట్యూటర్స్‌/డిమాన్‌స్ట్రేటర్‌లకు 9 శాతం డీఆర్‌లు ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జీఆర్‌కే రెడ్డి, ఫైనాన్స్‌ సెక్రటరీ ఆర్‌ఎల్‌ నరసయ్య, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జె.గంగాధరావు, పూర్వపు అధ్యక్షుడు పీఎం రామకృష్ణారెడ్డి, సలహాదారులు పీవీ లక్ష్మీపతి, ఆర్‌. వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న విశ్రాంత అధ్యాపక సంఘం ప్రతినిధులు

నేటి నుంచి రైల్వే గేట్‌ మూసివేత

భీమడోలు: భీమడోలులో రైల్వే ట్రాక్‌ అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ సోమ వారం నుంచి 24వ తేదీ గురువారం సాయంత్రం వరకు గేటును రైల్వే అధికారులు మూసి వేస్తున్నా రు. భీమడోలు, పూళ్ల రైల్వే స్టేషన్ల మధ్య గల 361 నంబర్‌ గల భీమడోలు ట్రాక్‌ మరమ్మతులు చేపడుతున్నట్లు రైల్వే శాఖ సీనియర్‌ సెక్షన్‌ ఇంజనీరు పేర్కొన్నారు. పలు వాహనదారులు, పశువుల పెంపకందారులు, రైతులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని రైల్వే అధికారులు సూచించారు. అయితే ప్రస్తుతం ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నందున రైల్వే ట్రాక్‌ మరమ్మతులతో ఇబ్బందులు పడతామని రైతులు అంటున్నారు. పాతూరు, వడ్లపట్ల అండర్‌ బ్రిడ్జిల నుంచి రాకపోకలు సాగించడం చాలా ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు చెబుతున్నారు.


భీమడోలు రైల్వే గేట్‌

విచ్చలవిడిగా చెట్ల నరికివేత

ఉంగుటూరు: విద్యుత్‌ లైన్లు లాగడానికి అడ్డు వచ్చిన చెట్లను విచక్షణారహితంగా నరికేస్తున్నారు. విద్యుత్‌ శాఖ అధికారులు చేస్తున్న ఈ పనికి పర్యావరణ ప్రియులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బ తినడానికి కారణం చెట్లను నరికడమేనని వారు వ్యాఖ్యానిస్తున్నారు. కైకరంలో రామన్నగూడెం వైపు లాగే లైన్ల కోసం భారీ చెట్లు సైతం నరికేసి అమ్మేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	బీళ్లచిక్కుడు	112
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	36
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	76	కంద	--
కాకర కాయలు	36	బీట్‌రూట్‌	38
బీరకాయలు	24	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	30	ఫ్రెంచ్‌బీన్స్‌	96
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్‌	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	30	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్‌	96
పొట్లకాయ(1)	25-30	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ (ఇంద్ర)	21.00	30
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్‌) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ (స్టార్‌ లైనర్‌ నాన్‌ఏసీ స్లీపర్‌)	22.30	07
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌	21.15	4822	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	10.45	4798	11
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్‌	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ఎస్సై బుద్దాలకు సత్కారం


బుద్దాల దంపతులను సత్కరిస్తున్న సమన్వయకర్త జేపీ, పార్టీ నేతలు

ఏలూరు టౌన్‌: పోలీస్‌ శాఖలో ఎస్సైగా విధులు నిర్వర్తించి, ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ పదవీ విరమణ చేసిన బుద్దాల శ్రీనివాసరావుకు వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయర్త మామిళ్ళపల్లి జయప్రకాష్‌ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బుద్దాల శ్రీనివాసరావు దంపతులను పార్టీ నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుద్దాల శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్‌జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, బుద్దాల రాము, దాసరి రమేష్‌, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌, వాణిజ్య సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్‌, కొల్లిపాక సురేష్‌ పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ఏలూరు టౌన్‌: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏలూరు పోలీస్‌ సబ్‌ డివిజన్‌ అధికారి కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ నిర్వహిస్తామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరు సబ్‌ డివిజన్‌ పరిధిలోని ప్రజలు వారి సమస్యలపై డీఎస్పీ కార్యాలయంలో వినతులు, ఫిర్యాదులు సమర్పించవచ్చని స్పష్టం చేశారు.

పేకాట స్థావరాలపై దాడి

దెందులూరు: మండలంలో ఆదివారం దెందులూరు, పోతునూరు గ్రామాల్లో పేకాట ఆడుతున్న వారిని దాడి చేసి పట్టుకున్నామని ఎస్సై రాచమల్లు శివాజీ అన్నారు. దెందులూరులో రూ.14 వేలు, పోతునూరులో రూ.16300 నగదు సీజ్‌ చేశామని తెలిపారు. రెండు గ్రామాల్లో 14 మందిని అరెస్ట్‌ చేశామని ఎస్సై వివరించారు. మండలంలో ఏ గ్రామ శివారు ప్రాంతంలోనైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా, సహకరించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తులు పోలీసుల నిఘాలో ఉన్న విషయాన్ని గమనించాలని ఎస్సై అన్నారు.

హామీల అమలులో కూటమి వైఫల్యం


12వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్‌


క్యూఆర్‌ కోడ్‌ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న సమన్వయకర్త జేపీ, పార్టీ నేతలు

వైఎస్సార్‌ సీపీ ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్‌

ఏలూరు టౌన్‌: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసిందని.. సూపర్‌ సిక్స్‌ హామీలను సైతం అమలు చేయలేక చతికిలపడిందని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్‌ విమర్శించారు. ఏలూరు వన్‌టౌన్‌లో బాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. వన్‌టౌన్‌లోని 12వ డివిజన్‌లో స్థానిక నేతలు జనార్ధన్‌, బండ్లమూడి సునీల్‌, కరీం, గౌస్‌, స్వామిదాసు, విడదల నాని, కల్లింగి గిరిరాజు, ఏసురత్నం, రాజు, అనిల్‌, దయాసాగర్‌, ప్రసాద్‌ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా రీకాలింగ్‌ బాబూస్‌ మేనిఫెస్టో క్యూఆర్‌ కోడ్‌ ప్లకార్డులను నాయకులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏలూరు సమన్వయకర్త జయప్రకాష్‌ మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు సంయుక్తంగా సంతకాలు చేసి మరీ ప్రజలకు ఎన్నికలకు ముందు హామీ పత్రాలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నేటికీ సూపర్‌ సిక్స్‌ హామీలు అమలు చేయలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు.

మహిళలకు మొండిచేయి

ఎన్నికల మేనిఫెస్టోలోని మరో 140కి పైగా హామీలను గాలికి వదిలేశారనీ, ముఖ్యంగా మహిళలను దారుణంగా మోసం చేశారని విమర్శించారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది 18 ఏళ్ల నిండిన మహిళలకు రూ.1500లు డబ్బులు వేస్తామని చెప్పి .. ఇప్పుడు పీ-4లో అమలు చేస్తామంటూ చెప్పటం సిగ్గుచేటన్నారు. తల్లికి వందనం పథకాన్ని సైతం కొందరికే ఇచ్చారనీ మిగిలిన తల్లులు, పిల్లల పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. ఏలూరు నగరంలో 8 వేలకు పైగా తల్లులకు అమ్మ వడి డబ్బులు అందలేదని చెప్పారు. ఇలా రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలోనూ వేలాదిమంది తల్లులకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్‌, వాణిజ్య సెల్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్‌, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, ఎస్సీ సెల్‌ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్‌, కార్పొరేటర్‌ తుమరాడ స్రవంతి, లీగల్‌ సెల్‌ జిల్లా అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, తులసీ, యువజన నాయకులు దాలి వెంకటేష్‌, సాయిప్రదీప్‌, బసవ, సత్యనారాయణ, విస్సకోటి నాగరాజు, ఉమామహేశ్వరరావు, పాతినవలస రాజేష్‌, కోటి, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం' నిర్వహణ

భీమడోలు: మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు కెరీర్‌ గైడెన్స్‌, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. భీమడోలు గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండే సుధాకర్‌ చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పుస్తకాలు చదవడానికి ఆసక్తి కనబరచాలని కోరారు. ప్రతి ఒక్కరూ 20 ఏళ్లు చదివితే మిగిలిన 80 ఏళ్లు సంతోషంగా గడుపుతామన్నారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్‌, జి.బంగారు పాప, కె.శ్రీనివాస్‌, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

నూతన కార్యవర్గం ఎన్నిక

పెదపాడు: పెదపాడు మానవత శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా వడ్లపట్ల ప్రసాద్‌, కార్యదర్శిగా ఉప్పాల రమేష్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఆలపాటి హనుమంతరావు, కోశాధికారిగా ఇంజమాల బాలశౌరి, సంయుక్త కార్యదర్శిగా చేవూరి వెంకట్రావు ఈసీ సభ్యులుగా ఆగొల్ల చంద్రశేఖర్‌, దావాల వెంకటేశ్వరరావు, వేము శ్రీహరి, గారపాటి రాజారామ్మోనరావు ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులచే కన్వీనర్‌ కుకునూరి సీతారామకృష్ణారావు, కో-కన్వీనర్‌ ఇన్నమూరి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.